Barcode - 2020120034792
Title - Khadga Thikkana
Subject - enter subject of the book
Author - Sannidhanamu Surya Narayana Sastri
Language - telugu
Pages - 33
Publication Year - 0
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13
2 020120 034792

ఖడ్గతిక్కన

సీ. తనబాహుయుగళంబు మనుమసిద్ధీశ్వరు
గవనివాఁకిటికి నర్గళలుగాఁగ
దనవాఁడియడిదంబు మనుమసిద్ధిమహీంద్రు
రాజ్యలక్ష్మికి నంగరక్షగాఁగ
దనకంటికెంజాయ మనుమసిద్ధినృపాలు
గాత్రంబునకుఁ గంచుకంబుగాఁగ
దనవజ్రకాయంబు మనుమసిద్ధిప్రభు
పట్టంపుటేన్గుకంబంబుగాఁగ
గీ. దన ముఖబ్రహ్మ తేజమున్ మనుమసిద్ధి
పరబలక్షాత్రతేజంబు శరణుఁగోరఁ
దాను బెట్టనికోట భూజాని కనఁగ
ఖడ్గతిక్కన సేనాని గ్రాలుచుండె.

చ. పగఱశిరశ్చయం బెగుర
బంతులకై వడి మింట నూఁచకోఁ
తగఁ దెగవైచుచున్ విఱుగఁ
దన్నుచు మార్కొను తేరిమొత్తముల్
రగులఁగఁజేయుచుం బరుల
రాజ్యములం దనచూడ్కి నిప్పులన్
లగువున నా ప్రవీరుఁడు
కలంకులఁ జూపెను వీరకేళులన్.

గీ. పగఱ గుండెలుదీసిన బంటతండు
శాత్రవులకోటలోఁ బాఁతి జయపతాక
వారి రత్నకిరీటముల్ బలిమిఁదెచ్చి
తేని పుత్రుల శిరసులం బ్రీతి నునుచు. ౩

కం. అనఘుం డాతఁడు ద్రాణికి
ననుజుం, డపరావతార మా భార్గవునం
దనునకు నని లోకంబులు
గొనియాడఁగఁ దాల్చెఁ గీర్తికోటీరంబుల్. ౪

చ. తొలఁగి ప్రపంచకంబునకు
దూరముగా నయి పేర్చు ద్వంద్వముల్
గెలిచి ముముక్షువృత్తిని సు
ఖింపఁ దలంచు ప్రశాంతులైన వి
క్రములు నడుముల్ బిగింప రణ
భూమిఁగలంపరె తోఁకచుక్కలై !
యిలపయి సాదుకేఁగఁ దల
యేఁగి పడుం బొలమం దఁటంద్రుగా !

గీ. బుధవరుండగు తిక్కన బుద్ధిబలముఁ
బ్రిబలుఁడగు ఖడ్గతిక్కన బాహుబలముఁ
దివిరి ధర్మార్థములను సాధింపఁ దనకు
మనుమసిద్ధీశ్వరుండు పాలన మొనర్చె. ౬

కం. ఒకనాఁడు మంత్రిముఖ్యులుఁ,
బ్రకృతులు, సామంతవరులుఁ, బరివేష్టింపన్
నికటాసనములఁ దత్సభ
కొక భటుఁ డా మనుమసిద్ధి యొద్దికి వచ్చెన్. ౭

ఆ. వె. వచ్చి వంగివంగి వందనం బొనరించి
వలువమడతలందుఁ బదిలపఱచి
తెచ్చియున్న కమ్మఁదీసి యం దిచ్చిన
సచివవరుఁడు దానిఁ జదివె నిట్లు. ౮

గీ. “శ్రీమహామండలేశ్వర శ్రీకరుఁడైన
సార్వభౌముండు యాదవ చక్రవర్తి
తనదు సామంతరాజైన మనుమసిద్ధి
కానతిచ్చుచు నున్న దెయ్యది ? యనంగ.” ౯

గీ. అనుచుఁ జదువుడు తేఁ “డాఁగుమాఁగు మచట
మనము సామంతులమె యాదవునకుఁ ? దాను
సార్వభౌముండె ! నన్ను నాజ్ఞాపనంబు
సేయునే యాతఁ ? డెట్టి విచిత్రవార్త ? ౧౦

గీ. కూన గండైన కరణి నీ కూళ నేఁడు
ఎంత గండరగండఁడై యేపుఁజూపె ?
వెలుఁగునఁట ! దివ్వె నిర్వాణ వేళయందుఁ;
గలుగునఁట ! తెల్వి యవసానకాలమందు; ౧౧

కం. ధనియాల జాతి వీనిది;
మనంబునం దెంచె వీఁడు మన సహానత్వం
బును బిఱికితన మటంచును;
వినాశకాలమున బుద్ధి విపరీత మగుఁగా. ౧౨

గీ. చదువు మాపయి" నావుడు సచివ వరుఁడు
చదువఁగాఁ బూనె నిట్లు "నీ జాబుఁ గంటి
మీరు పుల్లరి నెగఁబెట్టినారుగానఁ
జర్యఁ గైకొందు మను వ్రాఁతఁ జదువ వింటి. ౧౩

కం. మాకీయ వలయు కప్పం
బీకుంటివి నీవ నాలుగేఁడుల నుండిన్
మాకత నుంటిమి యోపిక;
నీ క్రియ వ్రాసితివి విప్రతీపముగా దే ? ౧౪

కం. కలదు ప్రభుత్వము సామం
తులపై రాజులకు సర్వతోముఖముగ; మీ
పొలమందు మాదుపసరం
బుల మేఁపుట ధర్మ; మేల పుల్లరి నీయన్ ? ౧౫

కం. తెలియక వ్రాసిన యీ వ్రాఁ
తలఁగూర్చి క్షమార్పణంబుఁ దగిన విధమునం
దెలుపమిఁ, బంపమి నీ వీ
వలసిన యరిఁ బట్టవలసి వచ్చును గత్తిన్. ౧౬

కం. హిత ముపదేశింతుము విను
బ్రతుకుము మాగొడుగు నీడఁ బదికాలాఁ; ల
ద్భుతమగు మా తేజో౽గ్నికిఁ
బతంగత వహింపఁబోక ప్రజలున్ నీవున్. ౧౭

ఆ. వె. కడుపుఁ గదలకుండఁ గుడిచికూర్చుండక
కాలుద్రవ్వు దీవె కయ్యమునకు
మానవంతు లైన మండలేశ్వరులము
ఇంతకన్నఁ దెలుప నేమి గలదు!" ౧౮

కం. అని చదువఁగఁ గవి తిక్కన,
విని భూపతి మనుమసిద్ధి "వీనికి సంధిం
చిన యట్లున్నది; గరళం
బునఁగా కెట్లితని రోగము నివార్య మగున్? ౧౯

చ. కరములుఁ గాళ్ళువట్టుకొని
కాదొకొ! కాటమరాజు వేఁడె "దు
ర్మరణముఁ బొందు గోగణము
మా "యెఱగడ్డ"ను మేఁతలేమి; నీ
కఱవున నాశ్రయంబొసఁగి
కావుము గోవధనుండి యుత్తుఁబు
ల్లరి" నని నేఁడొనర్చు నవ
లాపము; నాల్కలు రెండు వీనికిన్ ౨౦

శా. దేవబ్రాహ్మణగోగణంబులు ధరి
త్రిం దుల్యపూతంబు; లా
దేవబ్రాహ్మణగోతతిం బ్రతిఫలా
ర్థిత్వంబుతో మేము సం
సేవింపంగను బోము; పుల్ల రిడినం
జేకొన్నఁ గోట్లబ్బునే?
యీవీటిండికి బుద్ధిసెప్పవలెనుం
డీ! నోరుమూయించుచున్. ౨౧

క. అని విఱిచి బొమలు వలుకఁగ
జననాథునిఁ జుట్టియున్న సామంతనృపుల్
మొనగాండ్రు నిట్లు వలికిరి
కనుఁగవ గురియంగ నగ్నికణము లుఱుముచున్. ౨౨

సీ. "ఆలకించెనో? లేదో? యల్ల "రక్కెసగంగ"
దనినుండి కాలుదూసిన విధంబు;
వినియుండెనో? లేదో? ఘనుఁడు "కర్ణాటుండు"
మొనమొన్న శరణుఁగోరిన తెఱంగుఁ;
దెలియునో? తెలియదో? యల "విజయాధిపుం"
డస్త్రసన్న్యాసి యైనట్టి వార్త;
నెఱుఁగునో? యెఱుఁగఁడో? సరదారు "సారంగుఁ"
డశ్వంబుఁ గోల్పోయినట్టి కబురు;

గీ. వినియు నెఱింగియు నెవ్వాని విక్రమంబు
సాయముగ నమ్మి యిట్లాడ సాహసించె?
నిలఁ బ్రభంజను నెదిరింప నెదుగు నెట్టి
భూరుహాము నేలపైఁ గూలిపోవకుండు? ౨౩

కం. మన కీవలసిన కప్పముఁ
దన కీవలె మనమె యనుచుఁ దలక్రిందులు సే
సెను; దానను దలక్రిం దగుఁ
దనదు నదృష్టం బఁటం చతం డెఱుఁగఁ డెదన్. ౨౪

కం. తన మండలేశ్వరత్వము
తన తేజస్సార్వభౌమతలు, మన సామం
తనృపాలత్వముఁ దేల్చును
రణాంగణమె రేఁపు వేగిరంపడ నేలా? ౨౫

కం. జనుఁ డెంత యున్నతిం గొను
వినిపాతం బొందు నంత వేళాంతర మం
దనియును, బొంగిన యది పో
వును బ్రొయిపాలై యఁటంచు బుధు లందురు గదా! ౨౬

కం. నోరా! కల్లల పుట్టయుఁ
బేరు హారిశ్చంద్రుఁ డన్న విధమున వీఁడున్
బేరి కుదాత్తుండును వ్యవ
హారంబుల నుద్ధతుండునై వర్తిల్లున్. ౨౭

మ. ఇదె! యా యాదవసైన్యసాగరగణం
బిట్టింకు లింకించు ని
య్యెదనే వేగురిపెట్టుగా నిలిచి మా
యం దొక్కఁడొక్కండె; మా
యుదుటుంగాంచఁ ద్రిలోకవీరతతికి
న్నడ్డాడవే గుండియల్?
యదువంశీయున కీదినంబునకె చె
ల్లెన్ వచ్చె వేయేఁడులున్ ౨౮

గీ. మిత్తి కుత్తుకయందు నువ్వెత్తుఁవాలి
యుత్తరింప మా కత్తులు దత్తఱించు;
నడలఁజేయంగలాము సహస్రబాహు
లన ద్విబాహులమయ్యు యుద్ధాంగణమున, ౨౯

కం. రణభేరిని మ్రోగింతుము
జననాథా! యానతిమ్ము! సరగ" ననవుడున్
విని యాతఁడు విధిలేకయ
యనుమతి నిడి కొలువు విడిచి యరిగె నిరవుకున్. ౩౦

కం. తన దగు వాగ్దానము చో
పహానఁ గాటమభూపుఁ డిడక పుల్లరిఁ గాల్ద్రి
వ్వెను; తేండ్ల బుద్ధి గర్వం
బునఁ గనక యధర్మవిషయములపై కుఱుకున్. ౩౧

గీ. సమరసాగరమందు నిశ్శంకముగను
శత్రుమత్స్యంబులను మ్రింగఁ జాలునట్టి
భటతిమింగిల బృందంబు వచ్చిచేరె
సిద్ధిరాజాజ్ఞ మేరకు యుద్ధమునకు. 3౨

గీ. విజయలక్ష్మినిఁ బెండ్లాడు విప్రవీరు
తోడి పెండిలికొడుకులు వేఁడినెత్రు
కదలఁబాఱఁ దాలిచి వీర కంకణముల
వీరతాయెత్తులం గట్టి వెడలి రనికి. 33

సీ. యమదండములఁబోని హస్తదండముల భీ
తినిఁ గొల్పు జగజెట్టి "తిప్పరాజు"
వ్రణకిణాంకం బైన వక్షశ్శిలావేదిఁ
గత్తులనూఱు "శ్రీకంఠరాజు"
భుజవిక్రమము పైకిఁ బొంగిన చందాన
నిక్కుమూఁపుల "పెద్దచొక్కరాజు"
బడుగుమేనికి జిల్గువలువయే కవచంబు
గాఁదాల్చు "గయికొండ గంగరాజు"
గీ. తనదు డాచేతినిం గేడెమునుగఁ జేసి
యాలములయందు మార్కొను "అచ్చిరాజు"
వాఁడిగోరుల నరసింహు పగిదిఁజీల్చు
"బసవరాజు"ను వచ్చిరి బవరమునకు. 3౪

శా. రంకెల్ వేయుచు గిబ్బపోఁతులకు సా
  క్షాత్రంబు సూచించుచున్,
ఘీంకారంబు లొనర్చుచుం గరితతి
  స్నేహానుబంధంబు ని
శ్శంకంజూపుచుఁ, బోఁతుసింగములకున్
  జ్ఞాతిత్వముం దెల్పుచున్
హుంకారించుచు, యోధపుంగవుల
  శ్రేణుల్ వచ్చి నిల్చెన్ వడిన్. ౩౭

కం. గిరులకు హిమాచలమువలెఁ
గరులకు నైరావతంబు కరణి రణధురం
ధరుఁడైన ఖడ్గతిక్కన
ధరామరేంద్రుండు నిలిచె దళవాయిగనై. ౩౮

గీ. రక్తపుం జందియంబులు గ్రీల నతఁడు
రక్తగంధంబు మైఁబూసి, రక్తతిలక
మాస్యమునఁబెట్టి, రక్తమాల్యములఁ దాల్చి,
సమరలక్ష్మీవరుం డన్న సరణి మెఱసె. ౩౯

ఆ. వె. మనుమసిద్ధిగొన్న రణదీక్ష విని చేసె
యాదవుఁడు ప్రతిప్రయత్నములను
దర్వ్యకాంక్షతోడ రాజ్యలోభముతోడ
వచ్చి రతని కండపడఁగ దొరలు. ౪౦

సీ. కదనరంగమునందుఁ గాలు ద్రిప్పని జోదు
పల్నాటి ప్రభువైన "పద్మనాయఁ"
డఁ వీరతతికి సింహస్వప్నమై పొల్చు
బలవంతులకుఁ బెద్ద "వల్లభన్న"
శత్రుసైన్యంబులఁ జప్పరింపఁగజాలు
నాలరి యగు "కరియాలరాజు"
పగఱకుఁ బ్రక్కలో బల్లెమై యొప్పు ను
ద్దండుండు "నేతిముద్దయ్యనాయఁ"
గీ. డాదిగాఁగల బల్లిదు లాలమునకు
విందుగుడువంగఁ జనుసట్టివేడ్క ప్రబల
వాఁడితనమును మీసలవలనఁగ్రుక్క
చప్పరించుచు వచ్చిరి హాస్తములను. ౩౯

కం. ఆ యాదవులకు సేనా
నాయకులై బ్రహ్మరుద్రనాముఁడు విక్రుం;
డాయత బాహువు పిన్నను
నాయండును వచ్చి యని మొనఁ నిల్చిరటఁ. ౪౦

గీ. ఉభయసేనలుఁ బాలేటియొడ్డునందుఁ
బంచలింగాలగుట్టకుఁ బ్రక్కనున్న
పెద్దమైదానమునయందు విడిసి యందు
వీరపాణంబొనర్చు చున్నార లలసి. ౪౧

గీ. అత్తఱిని ఖడ్గతిక్కన యాత్మసేన
కనియెఁ "బిచ్చుకపైని బ్రహ్మాస్త్రమట్లు
యాదవుని గెల్వ నింత సైన్యం బదేల ?
యుండుఁడిటఁ దీర్తుఁ బని నే నొకండ పోయి." ౪౧

కం. అనుచుం గతిపయసైనికు
లను మాత్రముఁ గొని యెదిరి బలముపైఁ గుఱికెన్
గని పిన్నమనాయండును
దనమొన నుసికొలిపి వానిఁదాఁకె మగఁటిమిన్. ౪౨

కం. కలియంబడెఁ గత్తులుఁ గ
త్తు, లీటియలు నీటియలును, దోడ్తోఁ గడిమిం
జెలరేఁగె సింహనాదం
బులతోఁ బటుసింహనాదములు పైకొనుచున్. ౪౩

కం. పులులుం బులులుం, గుంజర
ములుఁ గుంజరములును, సింగములునున్ సింగం
బులుఁ, గార్దున్నలు దున్నలు
బలె యోధు లొకళ్ళొకళ్ళపయిఁబడి రంతన్. ౪౪

మ. తలలన్ వ్రేయుచు, ఱెక్కలన్ విఱుచుచున్
దర్పంబునం గ్రుద్దుచున్
నలుగం జేయుచు, మట్టగించుచును, వెం
టం బాఱి ఖండించుచున్

బలిమిం జీల్చుచు వాఁడిగోళ్లఁ గొనలన్,
బల్లెంబులం గ్రుచ్చుచున్
గలనిం జేయఁ దొడంగె నా యిరుమొనల్
గాటెక్కు రౌద్రంబునన్. ౪౬

ఆ. వె. తాఁడిఁ దన్ను వానిఁ దలఁదన్ను వాఁ డుండు
నన్న చందమునఁ దదాహవమున
వానిమించి వీఁడు, వీని మించి మఱొకండు,
వీరి మించి తాఁకె వేఱొకండు. ౪౭

ఆ. వె. కత్తి మొక్కవఱచు కర్కశత్వముగల్గి
కండగొన్న వారి గాత్రకములు
వాఁడి అంపములను మోపి ధ్వనర్పఁగఁజాలు
రాతిదూలముల తెఱంగుఁదాల్చె. ౪౮

చ. వికటత విప్రవీరుఁడు ప
విం బురుడించెడు కత్తిఁదూసి యు
త్సుకుఁడయి దూఁక, గట్టుకడఁ
జూచుచునుండిన యాదవాళి కొం
డకదలివచ్చుచున్నది హు
టాహుటిగా నని దోఁప జూచువా
రికిఁ బఱతెంచి పేర్చి పర
బృందముపైఁ బడె వెన్కపాటుగన్. ౪౯

గీ. ఖడ్గతిక్కన చేతిలోఁ గత్తియుండ
మనకుఁ బనియుండఁబోదని మదిని నమ్మి
మనుమసిద్ధిమహీపతి మొనలు త్రాగి
పరవశతఁగొంట రావ యీ ప్రాంతమునకు. ౧౦

చ. అఱనిముసంబులోపలనె
యాదవుసైన్యము మన్మసిద్ధి భూ
వరు భటసంతతిం గవియ
వారలొక్కొక్కరుఁ దీసిపోక పె
క్కురవలెఁ జీఱికింగొనక
కొండొకకాలము పోరి డస్సి మె
ల్లరు భువి మూర్ఛమున్గిరి బ
లంబటి తిక్కన దక్క దుర్విధిన్. ౧౧

కం. పిఱుదివియఁ దలంపకె యొం
టరియయ్యును ఖడ్గతిక్కన భుజాయుగమే
పరకంఠవల్లులకుఁ గ
త్తెరగాఁ జేయుచును దాఁకెఁ దెగువన్ వారిన్. ౧౨

కం. తమవారిఁ ద్రోసికొని పి
న్నమనాయఁడు వచ్చి ముందునకు, మానిచి యు
ద్ధము, నెదుట నిలిచి బత్తిని
నమస్కరించి రణతిక్కనకు నిట్లనియెన్. ౧౩

శా. "మీరల్ విప్రులు: రేము శూద్రులము స్వా
మీ! మీ పవిత్రాంఘ్రులన్
నీరంధ్రంబగుభక్తిఁ గొల్తుముగదా!
నిత్యంబు; జాలింపుఁ డీ
పోరాటంబును; మాకుఁ జుట్టుకొనునే
మో! బ్రహ్మహత్యాఘ; మీ
వీరల్ కొండలఁ బిండిఁగొట్టఁగను బ్రా
ణ్యంజుట్టఁగా దిట్టరుల్. ౧౮

చ. అనవుడు ఖడ్గతిక్కఁ డన
హాయబలిష్ఠుఁడు గానఁ జీటికిం
గొనకయుఁ దద్విభీషికల,
గుఱ్ఱ మరాతులపైకిఁ దోలి క
త్తిని విదిలించు చోఁదలలఁ
ద్రెంచుచుఁ గల్క్యవతారమట్లు తా
నని మొనఁ గొంతకాలము వి
హారమొనర్చెను విక్రమాఢ్యుఁడై ౧౯

ఆ. వె. అలసెమిగుల నొడలు కొలఁది సేఁపటికి; కంతఁ
జెమటవట్టి కత్తి చేయిజాఱెఁ;
బ్రిదిలిపోని ధృతిని వదలఁ గళ్యము వారు
వంబు నూర్పుఁదొడఁగెఁ బగఱదండు ౨౦

కం. విడివడ గుఱ్ఱము గాడిద
వడువుం గొని కాలఁదన్ను; వసమఱి కఱచున్
ఒడలెల్లఁ బుండువాఱఁగఁ;
గడుఁ దోఁకను విసరి తల్లకిందుగాఁ బడవేయున్. ౫౭

ఆ. వె. వానియశ్వ మనినిఁ బ్రళయతాండవ మాడి
బడలిపోయి పిక్కబలము దఱుగఁ
బరులు తన్ను రౌతుఁ బరిభవింత్రని యేమొ!
తనదు విడిఁది కేఁగఁ దలఁచె మదిని. ౫౮

కం. తురగం బాతనిఁ గైకొని
పఱచెం బురమునకు; నొడలు స్వస్థతలేమిన్
మరలింపమానెఁ దమదగు
పరివారము నిలిచియున్న వంకకు దానిన్. ౫౯

గీ. ఒడలు ససిలేమి వచ్చిన నోటువడియె
వచ్చెననుకొందురు లోకులు పరిహసింతురు
నని తలంపక రణతిక్కఁ డరుగుదెంచె
స్వాస్థ్యమునుబొంది మరలఁబోవచ్చు ననుచు. ౬౦

కం. బలమఱినఁ జచ్చిపోవక
పొలికలనన్, "స్వగృహమునకుఁబోఁదలఁచుట శూ
రుల కనుచిత మగు" ననియెడి
తెలివింగొనఁ డతఁడు హయము దిరిగెడు నదనన్. ౬౧

ఉ. ఆతఁడు వచ్చుచుండఁగ గృ
హాభిముఖుండయి త్రోవఁ బౌర సం
ఘాతము వాని వ్రాలిన మొ
గంబును, గెల్పుపతాకలేని డా
చేతినిఁ, గత్తిలేని వలచేతినిఁ
గాంచియు నవ్వసాఁగె; స్త్రీ
వ్రాతము మూతిఁద్రిప్పి విఱు
వందొడఁగెన్ నెటికల్ కడుం గడున్. ౬౨

చ. ప్రమద మెలర్ప నత్తఱిని
బాటకుఁ బ్రిక్కనె బాలకుల్ సుహృ
త్సమర మొనర్చుచుండి; రొక
శాబకుఁ డోడి శిరస్సు వాంచి గే
హమునకుఁ బోవుచుండ నధ
మాధముఁ డాఁడుదికన్న యుద్ధరం
గము విడి పాఱువాఁడని న
గంగఁ దొడంగిరి గేలి సేయుచున్. ౬౩

ఆ. వె. ఖడ్గతిక్కఁ డోటుగని పట్టితిక్కఁడై
పాఱివచ్చె నంచుఁ బ్రజలఁ బ్రాఁకి
యతనికన్న మున్న యరుదెంచె దుర్వార్త
యిస్సిరో? యనంగ నింటివారు. ౬౪

కం. తురగంబు డిగ్గి లోనికి
నరుదెంచిన పతినిఁ గాంచి యతని యువతి తాఁ
బరికించియుఁ బరికింపని
సరణిని నెమ్మొగము మలఁచి చరచర నరిగెన్. ౬౫

క. శత్వృ ద్ధాతని జనకుఁడు
ధృతరాష్ట్రుఁడు కూరుచుండి తిన్నెపయినిఁ ద
త్సుతు సేమముఁ బ్రశ్నింపఁడు
కుతుకముఁ గొనఁ డతని రాకకును లేశంబున్. ౬౬

ఆ. వె. శిష్యుఁడొకఁడు వాని చెంతఁ బారంబును
వల్లెవేయువాఁడు పాడె నిట్లు
"మగతనంబులేని మగవాని కన్నను
బేఁడివాఁడ మేలివాఁడు సుమ్మ ! ౬౭

కం. మరణం బవశ్యమేకద !
ధరఁగీరితి మలిన పఱపఁదగునే జంతూ
త్కరమునకు వృథగ?; నరయఁగ
మరణం బపయశము కన్న మాన్యముగాదే ?" ౬౮

కం. ఎఱిఁగియును దల్లి యాతని
యరుదెంచినవార్త నెఱుఁగనట్టులు లోనం
దిరుగుచు నుండెనుగానీ
యరుదెంచితె? తిక్క! నాయనా! యన దయ్యెన్. ౬౯

కం. తన వార్వమునకు దాణాఁ
దినిపింపఁగ, నీరు వట్టుఁ దీర్పఁగ, మరియున్
దన దుస్తులందు కొనఁగను
గనిపింపండయ్యొ బంటొకండేని నటన్. ౨౦

కం. తన ముద్దుపట్టిపిలిచినఁ
దనవంకకు రాక నరిగె దాదాల; కిటుల్
తన సర్వస్వముఁ బూనెను
దనతో సత్యాగ్రహంబుఁ దగఁగావింపన్. ౨౧

ఉ. ఆతఁడు చాఁపనుం బఱచి
యంగము వ్రాలిచి త్రోవఁ బొరసం
ఘాత మొనర్చ నవ్వు తొలి
గా నిదిదాఁక ఘటిల్లు నీ పరా
భూతిపరంపరం గుఱిఁచి
మోము ముడించి స్వకీయదోషపుం
జేఁతఫలంబుగా నెఱిఁగి
చింతిలుచుండె నెడంద నొంటిగా. ౨౨

గీ. అత్తఱిని "లేవవచ్చు నీళ్లాడ"నంచు
వాని కశరీరవాణి నా వీనులఁబడె
నాతఁ డింటికిఁ గ్రొత్తవాఁడైనయట్లు
లెదుటఁ బసోయు భార్యయు నోదిగిపోయె ౨౩

కం కానిమ్మని రణతిక్కన
స్నానార్థము లేచి పెరటిచాయకుఁ జనియెన్
మానంబు కన్న నతనికిఁ
బ్రాణంబే తీపి యయ్యె నక్కాలమునన్ ౨౪

కం. కనిపించె స్నానదేశం
బున నిలిపిన నులకమంచమును, దానికిఁ జా
టున నొక్క నీళ్ళబిందియు
యును, దానం బసుపుముద్దయును దిక్కనికిన్. ౨౫

కం. తిక్కండాతఁడు మొదలనె!
తిక్కెక్కఁగ దానిఁ గాంచి దిగమ్రింగి యెటో!
ప్రక్కఁగల పడఁతిఁ గనుఁగొని
యిక్కత యేమే? మనుడు నాపె యిట్లని దులిపెన్. ౨౬

* కం. "పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెందున్!
ముగురాడువార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్. ౨౭

కం. పురుషుఁడ వని మా తండ్రిరి
పొరపడి నన్నొసఁగె నీకుఁ; బోరిఁ బౌరుషముం
బరులపయిఁ జూపినప్పుడె
పురుషుం డగు; వట్టి రూపమునఁ బురుషుండే?" ౨౮

కం. అని వీరావేశంబునఁ
దన నాథుని నీసడించి తగవతి తా న
ట్లనవలసివచ్చినందుల
కనయముఁ జింతిలుచుఁ బాసి యచటాపె చనెన్. ౭౯

ఆ. వె. పసుపుకుంకుములకు వలెనె తేజమునకు
హాని సైఁప దెపుడు మానిని మది;
కత్తిఁ జేతి కిచ్చి కదనస్థలికిఁ బంపి
పతి గతింపఁ దోన చితి గమించు. ౮౦

గీ. పచ్చిపుండయి నొగిలించువాని యెడఁద
గుండు గ్రుచ్చిన యట్లయ్యెఁ; గొంతతడవు
సైఁపలేకయు నెట్లెట్లొ సైచి వ్యధను
బలుక కింకెట్టి మాటపైఁబడునొ? యనుచు. ౮౧

కం. తల తిరుగుచుండఁ, జిత్తము
గళవళపడఁ, దొట్రుపాటు గదురఁగ నడలన్
అలముఁగఁ గన్నులఁ జీఁకటి
మెలమెల వంటింటి పీఁటమీఁదికి నరిగెన్. ౮౨

కం. మడిదోవతి ప్రితిగాఁదన
పడఁతుక ధరియించుకొనఁ బరికించి యటన్
గడఁద్రోచి యెడమకాలను
నుదుకుచుఁ దడివల్వఁ గూరుచుండె భుజింపన్. ౮౩

గీ. పాఱుఁబోఁతైన పుత్రుని పార్శ్వమందుఁ
దాఁ భుజించుట పెద్దపాతక మటంచుఁ
దలఁచి రాఁ డయ్యెఁ బంక్తికిఁ దండ్రి యలిగి
యడుగఁ డయ్యెను దిక్కండు నతనిఁ గూర్చి. ౮౪

గీ. తల్లి వడ్డించు మౌనవ్రతంబుతోన
తలను వాంచియు కూర్చుండెఁ బలుక కతఁడు
వలయునది కేల వలదను; వలవనట్టి
దాని వడ్డించుకోనుఁ ద్రోయు దాల కెఱఁగి. ౮౫

మ. తినఁగా నన్నముఁ గూరలుం గలిపి మ
ర్దించున్; బ్రమాణాధికం
బునుగా ముద్దలుసేయు; వానిఁ జిదుమం
బూనున్; భుజింపంగఁ జే
తిని దా నెత్తును నోటిదాఁక; మఱలం
దీయంగ నుంకించు; నా
యన యిట్టుల్ మతిమాలి పేరునకె
యాహారంబు నంజెం దగన్. ౮౬

కం. ఉదరాగ్ని యడఁగ నాతని
హృదయాగ్నిని నేమి నోటి కింపుగ నుండున్?
మెదుకులు నాల్గివ్విధమునఁ
గదుకుచు వడ్డించెఁ దల్లి కడకుం బోలన్. ౮౭

కం. మునుపటివలెఁగా కవి తన
మనస్సువలె విఱిగియుండ మల్లడిగొని తి
క్కన యనె "నేఁ డేమమ్మా!
మన యీ పాల్విఱిగె?" ననుడు మాత వచించెన్. ౮౮

* కం. "అసదృశముగ నరివీరులఁ
బసమీఱఁగ గెలువలేక పందక్రియన్ ని
వసివైచి పాఱివచ్చినఁ
బసులున్ విఱిగినవి; తిక్క! పాలున్ విఱిగెన్. ౮౯

కం. మగనాండ్రిందఱు నన్నున్
"మగవాఁ డుదయించె వీరమాత"యటంచుం
బొగడిరది రిత్తయయ్యెను
బొగులుదు" గొడ్రాలఁ గాకపోతి నటంచున్. ౯౦

కం. అనుచున్ సొల్లుంఠనముగఁ
దన తల్లి వచింప నతఁడు దన నెమ్మొయి వాఁ
తను వేసినట్లు, హృదయం
బున శల్యము నాఁటినట్లుఁ బొగిలె న్నొగిలెన్. ౯౧

కం. మనసుచెడి యుత్తరాపో
శనమును బొనరించి లేచి చయ్యాన నింటం
దనకు ఘటిల్లిన నమ్మా
నసఁగూర్చి ఖడ్గతిక్కన దలంచె నిటుల్. ౯౨

మ. ననువీరెల్లరుఁ బాఱుఁబోఁతనని యు
న్నాళ్లే సమార్జించియుం
డిన కీర్తిం గయికోక యిట్టు లవమా
నింపన్ మొదల్వెట్టి; రు
ర్వ్య నిసీ! గుమ్మడికాయయంత గుణముం
బేరోర్వక యావంతయుం
డిన దోషంబుఁదలంత్రు పెద్దగ జనుల్
డెందంబునం గ్రూరులై. ౯౩

ఉ. నేనయి పాఱివచ్చితినె?
నిల్చియు నొంటరిగా నలంగ నా
మే, నసిజాలఁ గేలఁ గడి
మిం దురగంబును ద్రోలి శత్రుసం
తానము నుగ్గునూఁచగ నో
నర్చితిఁ ద్రొక్కఁగఁజేసి; డస్సితిన్;
గాని తుదిన్ హయంబు ననుఁ
గైకొనివచ్చె; నెవం డెఱింగెడిన్ ? ౯౪

కం. కొని తేరకున్నఁ దురగము
నను నాపాలికలని నుండి నా కీరితి భూ
మిని నాచంద్రార్కముగాఁ
దనరెడి దకళంకముగ నితాంతోజ్జ్వలమై. ౯౫

ఉ. నమ్మరు; నమ్మఁజేయుటకు
నాకిట సాక్ష్యములేదు; కాన దో
షమ్మను సమ్మతించి యయ
శమ్మను బాఁపుకొనంగ యుక్తయ
త్నమ్మొనరింతు; నాదుతలి
దండ్రులు భార్యయు నిట్లు నాప్రతా
పమ్మన కేవగింపఁ బెఱ
వారల సంగతిఁ జెప్పనేటికిన్! ౯౬

కం. బలమఱినఁ జచ్చిపోవక
పొలికలనను స్వగృహమునకుఁ బోఁదలఁచుట వీ
రుల కనుచితమగు! "నాకీ
తెలివేటికి లేదొ! హాయము దిరిగెడు నదనన్. ౯౭

ఉ. నోరను నాల్కలేనిది; న
నున్ భగవంతునిఁగాఁ దలంచుచున్
ద్వారతలంబునన్ నిలిచి
వచ్చు ననుం గని నిండుబత్తితో
హారతి నిచ్చుచుండు ప్రియు
రాలు తలంకక యీసడించి నన్
జీఱికిఁనైనఁ గైకొనక
త్రీవనుచుం దెగడెం గడుంగడున్. ౯౮

మ. నను యుద్ధాగతు, రక్తసిక్తతను, వి
న్నాణంబుగా శైశవం
బునఁ గ్రీడాక్షతగాత్రునిం బలెనె దాఁ
పుంజేరి నెత్రద్దు; మం
దును రాయున్; మెలమెల్లఁ బట్టు మెయిఁ గే
ల్దోయిన్; భుజింపించు; ని
ద్రను బుచ్చుం దోలి; నేఁడు నా జనని నన్
అంపంబునం గోసెఁబో! ౯౯

గీ. శిరసుపైఁ జేయివైచి స్పృశించు చెపుడు
సమరకేళికళారహస్యములఁ గఱపు
తాతపాదుల మూఁకవర్తింబు నన్నుఁ
గాఱుచిచ్చునఁ బడఁద్రొబ్బి కాల్చుచుండె. ౧౦౦

గీ. వీరరక్తంబు వీరశరీరమందుఁ
బ్రత్యణువునుండి చిందుచుఁ బైకిఁ బఱచు
ముదిసినను జేవగొనె వీరహృదయము; లిలఁ
జెప్పుదురుగాదె? ముదిమాఱిచు చేవయంచు. ౧౦౧

శా. నాయందుంగల కూర్మిచేతన సుమీ!
నా బాంధవుల్ మిత్రముల్
నాయీ వీర్యకళంకముం సయిపకు
న్నా; రట్టులన్నా; రిలన్

శ్రేయస్కాములె తప్పుపట్టుదురుగా
నీ శత్రులేమెత్తురు; నేఁ
బ్రాయశ్చిత్తము సేసికోవలె విశం
బంబేల యీచేతకున్? ౧౦౨

కం. అని తలఁచి వీరపాణిం
బునవలెఁ దత్క్షత్రియుల వీర్యము విజృంభింపన్
ఇనుమడి ముమ్మడియై, తి
క్కన నిలువఁగఁ జాల కనికిఁ గ్రక్కున నుఱికెన్. ౧౦౩

శా. ఆకాశంబును మ్రింగునో? పెఱుకునో
యామేరుశైలంబు; న
జ్జాఁకల్ పొందఁగ మూఁడుకోట్ల సురలు;
సప్తాంభోధులం ద్రచ్చునో?
వీఁకన్ లోకముఁ బెండలించి యెగురన్
వేయంగ భావించెనో?
భూకంపంబు ఘటించునో? యని జనంబుల్
పొంది రెంతే వెఱన్. ౧౦౪

గీ. అట్లు నని విప్రవీరుఁ డాయురుల సేన
పైనిఁ జిచ్చుఱపిడుగు చందానఁ బడెను;
గాఁడు దిక్కుం డితండు భార్గవుఁడె వచ్చెఁ
బఱపాఁటంబుమై నని వారు దలఁక. ౧౦౫

గీ. పదియు నాలుగులోకముల్ భస్మరాశి
సలుపు కౌశికు దివ్యాస్త్రసంచయంబు
పెంపడఁగి మోఁకతిల్లె నిర్వీర్యమగుచు
బ్రాహ్మ్య తేజంబు నెవ్వాఁడు ప్రతిఘటించు ? ౧౦౬

కం. పేలం గ్రుక్కినగతి, నఱి
కాలన్ నల్లులను రాయికరణిని, గాయల్
చీలిచినరీతి, శాత్రవ
జాలము నాతండొనర్చె సంహారంబున్. ౧౦౭

* చ. పదటున వాజి రాహుతుల
పై దుమికించుచుఁ దిక్కఁడార్చినన్
బెదరి భ్రమించి భీతివడి
పెల్లుగఁ జూడ్కులు సంచలింపఁగా
నదె! యిదె! వాజి; వాల్మెఱుఁగు
లల్లవె! యాతఁడె తిక్కఁడంచనన్
గోడుకక యాజిసేసె రిపు
కోటుల కందఱి కన్నిరూపులై. ౧౦౮

కం. విఱిగిన కాళులఁ, బగిలిన
శిరములఁ, దెగిపడినయట్టి చేతుల బహుధా
తరిగిన యొడళ్ల నా సం
గరభువి నూనాంగణంబు కరణిం బొలిచెన్. ౧౦౯

గీ. పదునొకండ్రైన రుద్రులు వచ్చి విప్పి
నిప్పుకంటి నటింపఁ జూచిరో యనంగ
రక్తనదులఁ బిపాసఁ దీర్పంగ మృత్యు
దేవతయు వచ్చెననఁగఁ దద్దేశ మొప్పె. ౧౧౦

కం. క్రమముగఁ బీనుఁగుఁబెంటై
సమరస్థలి కానిపింప సరదారగు పి
న్నమనాయఁడు గుండెలు చెడి
ప్రమాద మగు ననుచు వెనుకప్రక్కకు జరిగెన్. ౧౧౧

గీ. జరిగి "పాకంబు ముదిరె నీ సారి కాన
నెట్లు వచ్చెట్లు పోవునో! యెఱుఁగరాము
దేనికైనను మే"లని తిక్కనికిని
బ్రహ్మరుద్రయ్య నుజ్జిగాఁ బంపె నతఁడు ౧౧౨

కం. వాదికి సముచితుఁడగు ప్రతి
వాదియు, వీరునకుఁ దగిన ప్రతివీరుండుం,
దా దొరకిన నొడ లెదుగఁగ
మీఁదికిఁ బరవశత దూఁకి మ్రింగఁ దలచుఁగా! ౧౧౩

శా. కొండల్ డీకొనినట్లు విక్రమమునన్
క్రోధించి కర్ణార్జునుల్
దండాదండిగ మారుకొన్న కరణిన్
దర్పించి దివ్యాస్త్రముల్

రెం డొండొర్వులఁదాఁకు చందమున
బల్మిం జేర్చి యా బ్రహ్మారు
ద్రుండుం దిక్కనయు న్నెదుర్కొనిరి సం
స్తుత్యంబుగా నత్తఱిన్. ౧౧౪

కం. సందీక కత్తివ్రేట్లకు,
సందక బల్లెంపుపోట్లు, కళ్యంబుల మిం
చుం దీవ లట్లు పఱపు చ
మందోత్సాహమున వారు మసలిరి కలనన్. ౧౧౫

కం. ఇరువురును గొదమసింగము;
లిరువురునుం గాఱుచిచ్చు; లిరువురును యువల్;
సరు; లన్యోన్యజిగీషా
పరు; లెట్లోనఁగూడు జయము ప్రత్యేకముగన్? ౧౧౬

కం. చివరికి వారిరువురు వా
రువములపై విసరి రొండొరుల ఖడ్గంబుల్;
తవులఁగ నెఱఁకుల నయ్యవి
భువిఁ బడెఁ దమ రౌతుకొలువు పోక కొఱలుచున్. ౧౧౭

శా. అంతన్ వారలు దూఁకి క్రిందికి స్వ
వీర్యంబెల్లఁ గుంచించి బా
హాంత ప్రోద్యత శాతఖడ్గముల యం
దర్పించి దర్పించి యు

త్యంతం బేకముహూర్త మందె విసరన్
దద్ఘాతలన్ శీర్షముల్
బంతుల్ వోలెను రెండుఁబై కెగసి నే
లన్ వ్రాలెఁ బార్శ్వంబులన్. ౧౧౭

కం. తలిదండ్రులును గళత్రం
బల తిక్కని వీరమరణ మాలింపంగా
వలకంట హర్షబాష్పం
బులు నురలె విషాదబాష్పములు డాకంటన్. ౧౧౮

కం. సమరోత్సాహియుఁ, బతినిన్
సమరమునకుఁ బ్రోత్సహించు సతియును, సుతు ప్రా
ణములకు వెఱవని సద్వీ
రమాతయును నాంధ్రభూమిఁ బ్రభవింత్రె యిఁకన్?

సీ. నందినిఁ బుత్తెంచె నిందు శేఖరుఁడు నీ
వన్న! యేతెమ్ము తారాద్రి కడకు
గరుడినిఁ బుత్తెంచె నరహరి రావయ్య!
గురుసిద్ధ తిక్క! వైకుంఠమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు న
భయకుల మిత్ర! రా! బ్రహ్మకడకు
నైరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము! తిక్కయోధ!

ఆ. వె. అనుచు వేఱవేఱ నర్థితోఁ బిలువంగ
వారు వీరు గూడ వచ్చివచ్చి
దివ్యయోగియైన తిక్కనామాత్యుండు
సూర్యమండలంబుఁ జొచ్చిపోయె. ౧౨౧

శుద్ధపత్రము.

పుట	పంక్తి	అసాధువు	సాధువు
26	20	గదుకుచు	గదుకుడు
28	1	బాలుఁబోఁతననియు	బాలుఁబోఁతనుచుని